సాక్షి పల్నాడు

ఆదివారం । 18 । మే । 2025



శంకరమ్మ తల్లి తిరునాళ్ల

చెరుకుపల్లి: మండల పరిధిలోని బలుసుల పాలెం గ్రామంలో వేంచేసియున్న శంకరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు.



మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు

పొన్నూరు: పొన్నూరులోని గాంధీ బొమ్మ సెంటర్, గుంటూరు బస్టాప్‌ల్లో మజ్జిగ పంపిణీ కేంద్రాలను శనివారం ఏర్పాటుచేశారు. జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు ప్రారంభించారు.

ఆక్రమణల తొలగింపు



వినుకొండ: వినుకొండలోని శివయ్య స్థూపం సెంటరులో ఆక్రమణలను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ఆక్రమణల తొలగింపు చేపట్టారు.

న్యూస్‌రీల్

జులై 5న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జులై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్, రెవెన్యూ, మోటర్ వాహన ప్రమాదాలు, చెల్లని చెక్కు, మనోవర్తి, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్లైతే ఫీజు వాపస్ చేస్తారని తెలిపారు.

జెడ్పీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, పరిపాలనాధికారులు, ఉద్యోగులు కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బీట్ ది హీట్ నినాదంతో పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు చెప్పారు. వేసవిలో ఎండల తీవ్రత, వడగాలులు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

వివాదాస్పదంగా మారిన ఫ్లెక్సీ




తెనాలిఅర్బన్: స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి మున్సిపల్ మార్కెట్‌లో శనివారం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసి ఫ్లెక్సీ వివాదస్పదంగా మారింది. ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో ఏర్పాటు చేయకపోవడంతో పలువురు జనసేన పార్టీ నాయకులు కమిషనర్ బండి శేషన్నను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించారా అంటూ అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే సహించేది లేదంటూ ఆయనను హెచ్చరించారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

- గుంటూరు, పల్నాడు జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. గత జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండు సెషన్లలో జరిగిన మెయిన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఆదివారం జరగనున్న అడ్వాన్స్‌డ్‌కు హాజరు కానున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల పరిధిలో ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్ట్ టెస్టు (సీబీటీ)లు జరగనున్నాయి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ అడ్మిట్ కార్డులో పొందుపర్చిన నియమ, నిబంధనలు విధిగా పాటించాల్సి ఉంది.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్ పరిధిలో గ్రూప్-డీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ-గుంటూరు (57201), గుంటూరు-మాచర్ల(57203), మాచర్ల-నడికుడి(57206), నడికుడి-మాచర్ల(57205), మాచర్ల-గుంటూరు(57204), గుంటూరు-విజయవాడ(57202) రైళ్లు ఈనెల 17, 18 తేదీల్లో రద్దు చేసినట్లు వెల్లడించారు. కాచిగూడ-నడికుడి(67779), నడికుడి-కాచిగూడ(67780) రైలు ఈనెల 18, 19 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 41,319 మంది విద్యార్థులు
- మూడు జిల్లాల్లో 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- నిముషం ఆలస్యమైనా నో... ఎంట్రీ



ఆన్‌లైన్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా, ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కాకినాడలోని జేఎన్‌టీయూ భాగస్వామ్యంతో ఏపీ ఈఏపీసెట్-2025ను నిర్వహిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజినీరింగ్ పరీక్షలకు 34,148, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 7,106, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 65 మంది ఉన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలను కలుపుకుని మొత్తం 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షల జరగనున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 41,319 మంది విద్యార్థులు

ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 41,319 మంది హాజరు కానున్నారు.

- గుంటూరు జిల్లాలో 15 కేంద్రాల పరిధిలో మొత్తం 25,692 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 21,551, అగ్రికల్చర్, ఫార్మసీ 4,100, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 41 మంది ఉన్నారు.
- పల్నాడు జిల్లాలోని ఐదు కేంద్రాల పరిధిలో మొత్తం 11,126 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 9,198, అగ్రికల్చర్, ఫార్మసీ 1,912, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు 16 మంది ఉన్నారు.

-బాపట్ల, చీరాలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల పరిధిలో మొత్తం 4,501 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంజినీరింగ్ 3,399, అగ్రికల్చర్, ఫార్మసీ 1,094, రెండు కలిపి రాస్తున్న విద్యార్థులు ఎనిమిది మంది ఉన్నారు.

విద్యార్థులు వీటిని వెంట తీసుకెళ్లాలి

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీ సెట్-2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీలో పొందుపర్చిన నిర్దేశిత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే రోజున సదరు ప్రింటవుట్ కాపీతోపాటు హాల్ టికెట్ వెంట తీసుకుని వెళ్లాలి. బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్ హాల్ టికెట్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్‌ఐడీలలో ఏదో ఒక ఒరిజినల్ తీసుకుని వెళ్లాలి. ఇవి మినహా ఇతర వస్తువులను అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి, ఎడమచేతి బొటనవేలి ముద్ర వేయాలి.

నిముషం ఆలస్యమైనా నో.. ఎంట్రీ

ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 9.00 గంటలు, మధ్యాహ్నం 2.00 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిముషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే రావాలి

- జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ
- అధికారులతో సమన్వయ సమావేశం



కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్

నరసరావుపేట: జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. శనివారం పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో వివిధ విభాగాల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ఎస్ఎస్‌సీ పరీక్షలకు 4766 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియేట్, ఎస్ఎస్‌సీ పరీక్షలు జిల్లాలోని పది సెంటర్లలో మొత్తం 1464 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వెల్లడించారు. పరీక్షలకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేశామని, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటుచేసినట్లు జేసీ వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటించినందున విద్యార్థులు, పరీక్ష సిబ్బంది తమ వద్ద ఎటువంటి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

మంత్రి నాదెండ్ల మనోహర్



రోడ్లు ఊడుస్తున్న మంత్రి మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహా, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంటే బ్యానర్లు పెట్టుకుని రోడ్లపై తిరగడం కాదని, ఉద్యోగులంతా ప్రజలకు మెరుగైన సేవలందించడమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని శనివారం ఉదయం శివాజీ చౌక్ నుంచి మార్కెట్ వరకు నిర్వహించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు తమకు నూతన పింఛన్లు, రేషన్‌కార్డులపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆయన ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ ఎందుకు రావడం లేదంటూ ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. తప్పనిసరిగా వారానికి ఒకసారి ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పలువురు కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వారందరిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, హౌసింగ్ ఈఈ భాస్కర్, పెద్ద సంఖ్యలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పవర్‌ఫుల్ ఉమెన్

- అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి యువతుల సత్తా
- ఆసియా పోటీల్లో మెరిసిన బంగారాలు
- షేక్ షబీనాకు ఎనిమిది స్వర్ణ పతకాలు
- మదిర షానూన్‌కు నాలుగు స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్య పతకాలు

SUNDAY SPECIAL



విక్టరీ స్టాండ్‌పై స్వర్ణ పతకాలతో షేక్ షబీనా

తెనాలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈనెల 12న ముగిసిన ఆసియా సబ్ జూనియర్, జూనియర్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జూనియర్స్ 84 కిలోల విభాగంలో తలపడిన షేక్ షబీనా నాలుగు బంగారు పతకాలను సాధించింది. స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 85 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 180 కిలోలు, ఓవరాల్‌గా 455 కిలోల బరువులనెత్తి నాలుగింటిలోనూ బంగారు పతకాలను కైవసం చేసుకోవడం విశేషం. ఇదే వేదికపై ఆసియన్ యూనివర్సిటీ కప్-2025లోనూ కేఎల్ యూనివర్సిటీ తరఫున పాల్గొన్న షబీనా మరో నాలుగు బంగారు పతకాలను సాధించింది. స్ట్రాంగ్ ఉమెన్ పోటీలో మూడో స్థానంలో నిలిచింది. రెండు ఈవెంట్లలో కలిపి ఎనిమిది బంగారు పతకాలను షబీనా సాధించింది.

అంతర్జాతీయ పోటీల్లో పతకాల పంట

షబీనాకు అంతర్జాతీయ పోటీల్లో పతకాల సాధన కొత్త కాదు. 2024 మేలో హాంకాంగ్‌లో జరిగిన ఆసియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ కమ్ ఆసియన్ యూనివర్సిటీ కప్-2024 పోటీల్లోనూ మెరిసింది. జూనియర్ విభాగంలో పోటీపడిన షబీనా స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలను సాధించింది. మూడు విభాగాల్లోనూ కలిపి టోటల్‌లోనూ మరో పతకంతో మొత్తం నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. 2023మేలో కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించింది. తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించిన చరిత్ర ఉంది. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లోనూ మూడు బంగారు పతకాలు, రజత పతకం సాధించింది. ఆసియా పోటీల్లో వరుసగా మూడేళ్ల నాలుగేసి బంగారు పతకాలను గెలుచుకోవడం విశేషం.

తల్లి ప్రోత్సాహంతో క్రీడా సాధన



స్ట్రాంగ్ విమెన్-3 కప్పుతో షేక్ షబీనా

పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన ఆటో ఎలక్ట్రీషియన్ మెకానిక్ బుజ్జి, షంషద్‌ల ఏకైక కుమార్తె షబీనా ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీబీఏ ఫస్టియర్ చదువుతోంది. పదో తరగతిలో పవర్ లిఫ్టింగ్‌పై ఆసక్తి చూపిన కుమార్తెను తల్లి ప్రోత్సహించింది. కామన్‌వెల్త్ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన తెనాలి యువతి జి.సాయిరేవతి శిష్యరికంలో కొంతకాలం సాధన చేసింది. అక్కడ నుంచి సాధన మంగళగిరికి మారింది. కోచ్ సంధాని శిక్షణలో సాధన చేస్తోంది.

ఆసియా పోటీల్లో పతకాలతో షానూన్




డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తెనాలికి చెందిన మరో యువతి మదిర షానూన్ రాణించింది. జూనియర్స్‌లో 47 కిలోల కేటగిరీలో తలపడిన తొలి అంతర్జాతీయ పోటీల్లోనే రజత పతకం, మూడు కాంస్య పతకాలను సాధించింది. స్క్వాట్‌లో 100 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 42.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 110 కిలోల బరువులనెత్తిన షానూన్ డెడ్‌లిఫ్ట్‌లో రజతం, స్క్వాట్, బెంచ్‌ప్రెస్, ఓవరాల్ ప్రదర్శనలో మూడు కాంస్య పతకాలను అందుకుంది. ఆసియన్ యూనివర్సిటీ కప్-2025లో పాల్గొన్న షానూన్ నాలుగు స్వర్ణ పతకాలను సాధించింది. రెండు ఈవెంట్లలో నాలుగు బంగారు పతకాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలను గెలుచుకుంది.

కేవీఐకే అకాడమీలో సాధన

2017 కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెలిచిన ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు శిక్షణలో స్థానిక కేవీఐకే అకాడమీలో షానూన్ సాధన చేస్తోంది. పట్టణానికి చెందిన మదిర ప్రభుదాస్, మదిర నయోమి కుమార్తె షానూన్. కేఎల్ యూనివర్సిటీలో బీబీఏ ఎస్ డిగ్రీ సెకండియర్ చదువుతోంది. కోవిడ్ సమయంలో ఫిట్‌నెస్ కోసం ఆమెను కేవీఐకే అకాడెమీలో చేర్పించారు. తనలోని టాలెంట్‌ను గుర్తించిన కోచ్ ప్రోత్సాహంతో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటూ పతకాలను సాధిస్తోంది.

ఆధునిక జీవన శైలే ఐబీడీకి మూలం

- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- ఐబీడీ వ్యాధిపై అవగాహన అవసరం అంటున్న వైద్యులు
- ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందిస్తే కట్టడి చేయవచ్చు
- రేపు వరల్డ్ ఐబీడీ డే



ఐబీడీ పోస్టర్లు

గుంటూరు మెడికల్ : పల్నాడుకు చెందిన నాగేశ్వరరావు కొంతకాలంగా తీవ్ర కడుపు మంటతో బాధపడుతున్నాడు. ఉద్యోగ రీత్యా రాత్రి సమయాల్లో ఎక్కువ సేపు మేలుకొని ఉండటం, సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడంతో ఈ మధ్యకాలంలో సమస్య తీవ్రమైన గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. వైద్యులు పరీక్ష చేసి సుబ్బారావు ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. బాపట్లకు చెందిన శ్రీనివాస్ డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల కాలంలో తీవ్రమైన కడుపు మంట సమస్య ఉత్పన్నమవడంతో తల్లిదండ్రులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. విద్యార్థి ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం, సకాలంలో ఆహారం తీసుకోకుండా చదువు ధ్యాసలో పడి ఒత్తిడికి గురవడం ద్వారా ఐబీడీ వ్యాధి బారిన పడ్డట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

ఇన్‌ఫ్లామేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యతో బాధపడుతున్న వారి సమస్య రోజురోజుకు ఎక్కువతోందని, సకాలంలో చికిత్స తీసుకోని పక్షంలో దీర్ఘకాలం వ్యాధి వేధిస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు తెలియజేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పదివేల మిలియన్ల కంటే ఎక్కువ మంది వ్యాధి బాధితులు ఉన్నట్లు ది యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ క్రోన్స్ అండ్ అల్సరేటీవ్ కొలిటీస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ వ్యాధిని నియంత్రణలో పెట్టడం తప్ప పూర్తిగా నయం చేయలేరు. ఐబీడీ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు 2010 నుంచి మే 19న ప్రపంచ వ్యాప్తంగా ఐబీడీ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

క్రాన్స్ వ్యాధి, అల్సరేటీవ్ కొలిటీస్ వ్యాధులనే ఐబీడీ వ్యాధిగా పిలుస్తారు. వాంతులు, విరేచనాలు, కొన్నిసార్లు రక్తపు విరేచనాలు, కడుపులో నొప్పి, అకస్మాత్తుగా శరీరం బరువును కోల్పోవడం, కడుపులో మంట, కడుపులో తిమ్మిరి, అత్యవసరంగా మలవిసర్జనకు వెళ్లాలనిపించడం, జ్వరం ఈ వ్యాధి లక్షణాలు. వ్యక్తులను బట్టి వ్యాధి లక్షణాలు మారుతూ ఉంటాయి.

కారణాలు

ఐబీడీ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, జన్యుపరమైన కారణాలు, జీవన విధానం, కొన్ని రకాల మందులు మింగడం ద్వారా, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం ద్వారా, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి వ్యాధి కారణాలు.

నిర్ధారణ

ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఎమ్మారై, రక్త పరీక్షలు, సిటీస్కాన్, మలపరీక్ష ద్వారా ఐబీడీ వ్యాధిని నిర్ధారిస్తారు.

బాధితులు 40 ఏళ్ల లోపు వారే

15 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఈవ్యాధి బారిన పడుతున్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి బాధితులే. కొంత మంది 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సులో వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడు వారంలో నలుగురు లేదా, ఐదుగురు ఐబీడీ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఐదుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. గతంలో విదేశాల్లో మాత్రమే ఎక్కువగా ఉన్న ఈ వ్యాధి భారతదేశంలో కూడా నేడు పెరిగిపోతుంది. ప్రతి ఏడాది వ్యాధి బాధితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతిరోజూ ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం, ధ్యానం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. ధూమపానం, మద్యపానం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. సమీకృత ఆహారాన్ని సక్రమంగా నమిలి మింగాలి. సరైన వేళల్లో ఆహారాన్ని తీసుకోవాలి. తిన్న వెంటనే నిద్రించకూడదు. రాత్రివేళల్లో త్వరితగతిన ఆహారం తినాలి. పాల ఉత్పత్తులు పరిమితి మోతాదులో తీసుకోవాలి. కాఫీ, టీలు, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

మేరా భారత్ మహాన్

అమర వీరులకు సంఘీభావంగా తిరంగా యాత్ర



తిరంగా ర్యాలీలో కూటమి నేతలు, కార్యకర్తలు

గుంటూరు మెడికల్: ఉగ్ర దాడులతో భారత్‌ను భయపెట్టాలని పాకిస్థాన్ చూసింది కానీ చివరకు తోక ముడిచిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టడంతోపాటు కాల్పులను దీటుగా ఎదుర్కొని ఘన విజయం సాధించిన దేశ సైనికులకు సంఘీభావంగా శనివారం బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. తొలుత మార్కెట్ సెంటర్ హిందూ కాలేజీ నుంచి బయలుదేరి ఏసీ కాలేజీ, శంకర విలాస్ బ్రిడ్జి మీదుగా లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదంపై తిరుగులేని విజయం సాధించామని వెల్లడించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ పెహల్గామ్ ఉగ్ర దాడిలో బలైన భారత పౌరుల ఆత్మకు శాంతి చేకూరేలా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయం భారత సైన్యం, ఎన్డీఏ విజయంగా పేర్కొన్నారు. ర్యాలీలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డెప్యూటీ మేయర్ షేక్ షజీల, కూటమి ప్రభుత్వ నేతలు పాల్గొన్నారు.

కళాశాల, పాఠశాలల విద్యార్థుల సంఘీభావం

కళాశాల, పాఠశాలల విద్యార్థులు 75 మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని, పెద్దఎత్తున తిరంగా ర్యాలీకి సంఘీభావం తెలిపారు. బీజేపీ నేతలు నూకల మధుకర్ జీ, బిట్ర వెంకట శివన్నారాయణ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి చెస్ జట్ల ఎంపిక

మాచర్ల రూరల్: పల్నాడు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్-11 చెస్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరగనున్నాయి. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఈ పోటీలు ఉంటాయని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కే కిరణ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల్గొనే వారు రూ.300 చెల్లించాలని పేర్కొన్నారు. 2014 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బాలుర, బాలికల విభాగాల్లో ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తామన్నారు. ఈ నలుగురు క్రీడాకారులు అండర్-11 పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 93900 59759 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు.

నాటిక ప్రదర్శనల్లో నేటి కార్యక్రమాలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట కళా పరిషత్, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం మూడోరోజు కొనసాగనున్నాయి. స్వర్గీయ నాగభైరు సుబ్బారావు కళాప్రాంగణంలో రాత్రి 7:45 గంటలకు కావూరి సత్యనారాయణ రచనకు ఏపూరి హరిబాబు దర్శకత్వ వహించిన అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి 'చిగురు మేఘం' నాటిక ప్రదర్శన ఉంటుంది. 8:45 గంటలకు అద్దేపల్లి భరత్ కుమార్ రచనకు ఎస్‌కే షఫీ దర్శకత్వం వహించిన ది అమేచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'అలీతో సరదాగా' నాటిక ప్రదర్శిస్తారు. 10 గంటలకు సభా కార్యక్రమం ఉంటుంది. టీవీ, రంగస్థల నటి గుడివాడ లహరికి సత్కారం చేయనున్నారు. 10:45 గంటలకు తాళాబత్తుని వెంకటేశ్వరరావు రచనకు అమృత లహరి దర్శకత్వం వహించిన అమృత లహరి ఆర్ట్స్ థియేటర్స్ వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక ప్రదర్శితం కానుంది. 11.50 గంటలకు శ్రీకృష్ణ మానసం నటులు గొట్టిపాటి కోటేశ్వరరావుచే ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.

అక్రమాలకు పోలీసు దన్ను

- యథేచ్ఛగా అనధికార ఎక్స్‌ప్లోజర్స్ విక్రయం
- జోరుగా లైసెన్స్ హోల్డర్ల అక్రమ వ్యాపారాలు
- కాపు కాస్తున్న పోలీసులకు నెల మామూళ్లు
- అక్రమ దందాకు అండగా ఉన్నామంటూ అధిక మొత్తానికి డిమాండ్
- చీమకుర్తి లైసెన్స్ పచ్చనేత ద్వారా పోలీసులకు మామూళ్లు



క్వారీల్లో ఉపయోగించే పేలుడు పదార్థాలను పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: గ్రానైట్ క్వారీల్లో పేలుడు పదార్థాల అక్రమ విక్రయాలకు జిల్లాలోని కొందరు పోలీసులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకాశం జిల్లా చీమకుర్తి కేంద్రంగా పేలుడు సామగ్రి లైసెన్స్‌దారు హైదరాబాద్, నాగపూర్, చెన్నై ప్రాంతాల నుంచి అక్రమంగా ఎక్స్‌ప్లోజర్స్‌ను పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని ప్రకాశం జిల్లా చీమకుర్తి, బాపట్ల జిల్లా బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ క్వారీల యజమానులకు బిల్లులు లేకుండా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమాలకు దన్నుగా ఉన్నందుకు పేలుడు పదార్థాల వ్యాపారులు కొందరు పోలీసు అధికారులకు నెల మామూళ్లు ముట్టజెప్పి తమ వ్యాపారాన్ని గుట్టు చప్పుడు కాకుండా సాగిస్తున్నారు. ఒక డీఎస్పీకి నెలకు రూ.15 వేలు చొప్పున కప్పం కడుతున్న వ్యాపారులు క్వారీల పరిధిలోని కొందరు సీఐలకు నెలకు రూ.15 వేల వంతున ముట్టజెపుతున్నట్లు సమాచారం. ఎస్‌ఐలకు సైతం రూ.15 వేలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల క్వారీల పరిధిలో కొత్తగా బదిలీపై వచ్చిన కొందరు ఎస్‌ఐలు స్థానికంగా పనిచేస్తూ అక్రమ వ్యాపారానికి దన్నుగా నిలుస్తున్నందున తమకు నెలకు రూ.20 వేలు ఇవ్వాలని లైసెన్సుదారులను డిమాండ్ చేసినట్లు సమాచారం. అంతటితో వదలక పేలుడు పదార్థాల లైసెన్సుదారులతో సమావేశం పెట్టి గట్టిగా చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక పోలీసుల సహకారం లేకుండా అక్రమ వ్యాపారం సాగించడం కష్టమని భావించిన పేలుడు పదార్థాల వ్యాపారుల సిండికేట్ దిగువ స్థాయి పోలీసు అధికారులకు నెల మామూళ్లు పెంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

అడిగినంత ఇచ్చేద్దాం

రికార్డులపై సంతకాలు పెట్టే అధికారులకు ఇచ్చే మొత్తం కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసు అధికారులకు వారు అడిగిన మొత్తం ఇవ్వాలని పేలుడు పదార్థాలను వితౌట్‌లో సరఫరా చేస్తున్న చీమకుర్తి లైసెన్సుదారుడు త్రినాథరావు పేలుడు సామగ్రి లైసెన్సుదారుల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. పోలీసు అధికారులు అడిగినంత మొత్తం అందరూ ఇవ్వాలని సదరు వ్యాపారి మిగిలిన లైసెన్సు దారులకు హుకుం జారీ చేశారు. జిల్లాతోపాటు ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఉన్న పేలుడు పదార్థాల లైసెన్సు దారులకందరికీ చీమకుర్తి లైసెన్సుదారుడే వితౌట్‌లో పేలుడు సామగ్రి సరఫరా చేస్తుండడం, పేలుడు సామగ్రి క్రయవిక్రయాల రికార్డులు సైతం ఆయనే నిర్వహిస్తుండడంతో మిగిలిన వ్యాపారులు పోలీసులకు నెల మామూళ్లు పెంచి ఇచ్చేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పేలుడు పదార్థాల అక్రమ విక్రయాల వల్ల అటు ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన రాబడికి గండిపడుతుంది. కానీ కొందరు పోలీసులు నెల మామూళ్లకు కక్కుర్తిపడి అక్రమ వ్యాపారాలకు దన్నుగా నిలవడం మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇప్పటికైనా పేలుడు పదార్థాల అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలి.

రికార్డులు పరిశీలించకుండానే సంతకాలు

వాస్తవానికి పేలుడు పదార్థాల వ్యాపారులు పేలుడు పదార్థాల కొనుగోళ్లు, విక్రయాలకు సంబంధించి ఫారం-3, ఫారం-4 రికార్డులను క్రమం తప్పకుండా నిర్వహించాల్సి వుంది. డీఎస్పీ స్థాయి అధికారి ప్రతి మూడు నెలలకొకసారి వీటిని పరిశీలించి సంతకాలు చేయాల్సి ఉంటుంది.

అయితే క్రమం తప్పకుండా నెల మామూళ్లు పుచ్చుకుంటున్న కొందరు పోలీసు అధికారులు పేలుడు పదార్థాల వ్యాపారులు రాసుకు వచ్చిన రికార్డులపై సంతకాలు చేయడం పరిపాటిగా మారింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా సేవలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

నరసరావుపేట: పల్నాడు జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి (డీసీహెచ్ఎస్)గా నియమితులైన డాక్టర్ ఎం.ప్రసూన శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె నుంచి పుష్పగుచ్ఛం అందుకున్న కలెక్టర్.. శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో కార్యకలాపాలన్నీ సక్రమంగా నడిచేలా చూడాలని కలెక్టర్ ఆమెకు సూచించారు. డాక్టర్ ప్రసూన స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చర్మ వ్యాధుల డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ బీవీ రంగారావు గుంటూరు జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. అప్పటి నుంచి పల్నాడుకు ఆయనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

క్రీడాసామగ్రి అందజేత

నరసరావుపేట: వేసవి క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. వేసవి సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న 50 ఉచిత శిక్షణ శిబిరాల ఇన్‌చార్జులకు శనివారం కలెక్టరేట్‌లో క్రీడా సామగ్రిని అందజేశారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయస్థాయి వరకు క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా క్రీడాధికార సంస్థ కోచ్ నరసింహారెడ్డి, క్యాంపు శిబిరాల ఇన్‌చార్జులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు చర్యలు



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం 'బీట్ ద హీట్ 'థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పాల్గొన్నారు. పచ్చదనంతోనే ఎండ నుంచి ఉపశమనం పొందేలా కలెక్టరేట్ కాంపౌండ్‌లో మొక్కలు నాటారు. చల్లదనాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టారు. మొక్కలతో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతరానికి పుస్తక పఠనం అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్



కవితా స్రవంతి ఆవిష్కరణలో పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ

నగరంపాలెం: నవతరానికి పుస్తక పఠనం అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. బృందావన్ గార్డెన్స్ ఐదో వీధిలోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీసు ఆర్గనైజేషన్ ప్రాంగణంలో శనివారం ఏపీ అభ్యుదయ రచయితల సంఘం 90 ఏళ్ల సంబరాల్లో భాగంగా కవితా స్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను నవతరం చదవడం అవసరమని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయారాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగాధరం, పఠాభీల కవిత్వాన్ని ఈ తరం సులభంగా చదువుకునేలా అందిస్తున్న అరసం కృషి మరువలేనిదని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబింబించేలా ఉన్నాయని తెలిపారు. అనంతరం యుద్ధం- శాంతి అంశంపై కవితా గోష్ఠి నిర్వహించారు. బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర, హేమలత, ఎం.లలితకుమారి హాజరయ్యారు. జనసాహితి దివికుమార్, రచయిత్రి మందరపు హైమావతి, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



నకరికల్లు: ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొలిమి బడే సాహెబ్ (69) పొలానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామశివారులో ఇటుక బట్టీల వద్ద రోడ్డు దాటుతుండగా చిలుకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఆతనికి తీవ్రగాయాలు కాగా, నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: సిబ్బంది పని చేసే చోట పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యం మెరుగవుతుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, ఆర్ఐలు గోపీనాథ్, కృష్ణ, యువరాజ్, పోలీస్ సిబ్బందితో కలిసి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసుస్టేషన్లలో శ్రమదాన కార్యక్రమాలు జరిగాయి. పిచ్చి మొక్కలు, చెత్త, వ్యర్థాలను తొలగించి, ప్రజలకు శుభ్రతపై అవగాహన పెంచారు.

30 నుంచి అండర్-16 ఓపెన్ టెన్నిస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్థానిక బీఆర్ స్టేడియంలో బాలబాలికల అండర్-16 ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం డైరెక్టర్ నాగేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఆంధ్రతో పాటు తెలంగాణకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంట్రీలను ఈ నెల 28లోపు బీఆర్ స్టేడియం కోచ్ అహ్మద్‌కు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98483 27654 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వ 'మెడి'కిల్

- అర్బన్ హెల్త్ కేంద్రాల నిర్మాణం పూర్తికి చొరవ చూపని పాలకులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.5.50 కోట్లతో ఐదు సెంటర్ల నిర్మాణం
- పూర్తయి అందుబాటులోకి వచ్చిన మూడు కేంద్రాలు
- మిగిలిన రెండు కేంద్రాల నిర్మాణం కూడా 90 శాతం పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికీ ఆరంభించని చివరి దశ పనులు



ఆలపాటినగర్‌లో దాదాపు పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనం



చంద్రబాబునాయుడు కాలనీలో పెండింగులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

తెనాలి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేసింది. పట్టణాల్లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. అద్దె భవనాల్లో నడుస్తున్న సెంటర్లకు శాశ్వత భవనాలు నిర్మిస్తూ వచ్చింది. పనులు చాలా వరకు పూర్తికాగా, అక్కడక్కడా తుది దశలో ఉన్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి, కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల్ని ఆపేసింది. అందుబాటులోకి తెచ్చేందుకు పూనుకోవడం లేదు.

ప్రజల చెంతకు వైద్య సేవలు

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ప్రజలు నివసించే ప్రాంతంలోనే వైద్యసేవలు అందించాలని నిర్ణయించింది. పట్టణాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అప్పటికే పట్టణ ముత్యంశెట్టిపాలెంలో నడుస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు అదనంగా అయితానగర్, సుల్తానాబాద్, కొత్తపేట, మారీసుపేట, పాండురంగపేటలో ఏర్పాటుచేసింది. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుంది, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించి, సత్వరమే రోగుల సేవల్ని ఆరంభించింది. ప్రత్యేకంగా లేబరేటరీని కూడా సమకూర్చింది. ప్రతి పట్టణ ఆరోగ్యకేంద్రంలో 60 రకాల వైద్య పరీక్షలకు అవకాశం కల్పించింది. వివిధ వ్యాధులకు మొత్తం 178 రకాల మందులను అందుబాటులో ఉంచింది. దీనితో తెనాలి ప్రజలకు ప్రతి చిన్న అనారోగ్యానికి చెంచుపేటలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం తప్పింది. సమయం ఆదా కావడం, రవాణా చార్జీల భారం తగ్గడంతో ప్రజలు సంతోషించారు.

శాశ్వత భవనాల నిర్మాణాలకు నాంది

అర్బన్ హెల్త్ సెంటర్లకు శాశ్వత భవనాల నిర్మాణానికి నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నడుంకట్టింది. ఒక్కో సెంటర్‌కు రూ.1.10 కోట్లు చొప్పున పట్టణంలోని ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.5.50 కోట్లను కేటాయించింది. పట్టణంలోని పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం, అయితానగర్-నేలపాడు రోడ్డు, సుల్తానాబాద్‌లో నిర్మాణం పూర్తయింది. ప్రైవేటు భవనాల్లోంచి ఆయా కేంద్రాలను శాశ్వత భవనాల్లోకి మార్చారు. నాటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యవేక్షణలో ప్రారంభోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా వైద్య కేంద్రాల్లో అందుతున్న వైద్యసేవలపై ప్రజల కూడా సంతృప్తిని వ్యక్తంచేశారు.

పనులు పెండింగ్


పట్టణంలో ఏర్పాటైన అయిదు అర్బన్ హెల్త్ సెంటర్లలో మూడింటికి శాశ్వత భవనాలు నిర్మాణం పూర్తయింది. చంద్రబాబునాయుడు కాలనీ, ఆలపాటినగర్‌లో తుదిదశలో ఉన్నాయి. అప్పట్లో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారటంతో ఆ పనులు పెండింగులో ఉండిపోయాయి.

- చెంచుపేట పరిధిలోని ఆలపాటినగర్‌లోని ఆరోగ్య కేంద్రం భవనం పనులు దాదాపు 90 శాతం పూర్తయింది. ఫ్లోరింగ్, ర్యాంప్, ఇతర చిన్న, చిన్న పనులు మాత్రమే నిలిచిపోయాయి. వీటి విలువ సుమారు రూ.10లక్షల ఉంటుందని అధికారుల అంచనా.
- చంద్రబాబునాయుడు కాలనీలో గ్రౌండ్ ఫ్లోరింగ్, రంగులు, టాయిలెట్స్ నిర్మాణం వంటి రూ.20లక్షల పనులు పెండింగులో ఉండిపోయాయి.

ప్రైవేటు భవనాల్లో అవస్థలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులు ఇప్పటికీ మొదలుపెట్టలేదు. భవనాలకు తాళాలు వేసి అధికారులు అలాగే ఉంచారు. వైద్య కేంద్రాలు ఇప్పటికీ ప్రైవేటు భవనాల్లో అరకొర వసతులోనే కొనసాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే పనులను పూర్తిచేసి ప్రజలకు సెంటర్లను అందుబాటులోకి తీసుకురావల్సిన ఆవశ్యకత ఉంది.

పెండింగ్ పనుల పూర్తికి సన్నాహాలు



పట్టణంలో చంద్రబాబు నాయుడు కాలనీ, ఆలపాటి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీటి గురించి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ నివేదిక అడిగారు. మంత్రి ఆదేశాలతో నిర్మాణ పనులను పూర్తిచేసి, ఆయా అర్బన్ హెల్త్ సెంటర్లను వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగిస్తాం.

– ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి